ముంచిన మున్నేరు..


ధంసలాపురం కాలనీలో కూలిపోయిన రేకుల ఇల్లు


బట్టలు శుభ్రం చేసుకుంటున్న బాధితులు

- ఇళ్లను శుభ్రం చేసుకునే పనిలో స్థానికులు
- సహకారం అందిస్తున్న అధికార యంత్రాంగం
- నిలిచిన వ్యర్థాలతో భరించలేని కంపు

ఖమ్మం సహకారనగర్: గత మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల వల్ల సర్వం వరదపాలయ్యాయి. నగరంలోని 16వ డివిజన్‌లోని ధంసలాపురం కాలనీలోని సుమారు 1,500 ఇళ్లల్లోకి నీరు చేరడంతో సామగ్రి అంతా ధ్వంసమైంది. టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, కూలర్లు నీటిలో తడిసి మరమ్మతులకు గురి కాగా.. పరుపులు, దుప్పట్లు, పలు గృహావసరాలకు వినియోగించే వస్తువులు సైతం నీటిలో కొట్టుకుపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. అదే విధంగా అగ్రహారంలోని లోతట్టు ప్రాంతవాసులకు నష్టం జరిగింది.

రెండు రోజులుగా క్లీనింగ్..

గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాలు కురిసి బురద ఇళ్లల్లోకి రావడంతో స్థానికులు వాటిని శుభ్రం చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. గత రెండు రోజులుగా రోజు కొంత శుభ్రం చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. రహదారులపైకి బురద చేరడంతో పాటు ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దుర్వాసన వస్తుందని, వీలైనంత త్వరగా ఆయా ప్రాంతాలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. పలువురు తమకున్న కొద్దిపాటి వనరులతో రేకుల ఇల్లు నిర్మించుకోగా అవి పూర్తిగా నీటిమట్టం కాగా... కొద్దిమంది ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

అధికారుల సహకారం ..

అధికారులు స్థానికంగా ఆయా వీధుల్లో తిరుగుతూ బుధవారం నిత్యావసర సరుకులను అందించారు. అధికార యంత్రాంగం బియ్యం, ఉప్పు, పప్పు, కారం, పాలు తదితర సామగ్రిని స్థానికులకు అందించారు.

సర్వ నాశనం..



ఊహించని విధంగా మున్నేరు వరద వచ్చి ఇళ్లంతా బురద చేసింది. అంతా ఎత్తిపోశాం కానీ ఇంట్లోని సామగ్రి, విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు పనికిరాకుండా పోయాయి. మూడు సెట్ల మంచాలు, పరుపులు పడేశాం. సుమారు రూ. 6 లక్షల వరకు నష్టం వాటిల్లింది.

– రమేష్, బృందావనం రోడ్, శ్రీనివాసనగర్

కోలుకోలేని దెబ్బ తీసింది..



భారీ వర్షాలకు రేకుల ఇల్లు కూలిపోయింది. కూలీ నాలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మమ్మల్ని ఆదుకోవాలి. కుమారుడు, కుమారుడు ఉన్నత చదువులు చదువుకొని ఖాళీగా ఉంటున్నారు. ఇది మాకు కోలుకోలేని దెబ్బ. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి.

– కనకపుడి లక్ష్మి, ధంసలాపురం కాలనీ

వీలైనంత సహకరిస్తున్నాం..



ఇళ్లు ధ్వంసమై, సామగ్రి కోల్పోయిన వారందరికీ వీలైనంత వరకు సహకరిస్తున్నాం. పలు ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నాం. మరికొన్ని ప్రాంతాల్లో ఇళ్లల్లోకి చేరిన బురదను తొలగింపచేస్తున్నాం. అధికారులు కూడా ఇంటింటి సర్వే చేస్తున్నారు.

– మేడారపు వెంకటేశ్వర్లు, కార్పొరేటర్, 16వ డివిజన్

వ్యాధులు దరిచేరకుండా..


ప్రకాశ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలో మామిళ్లగూడెం, ముస్తఫానగర్, వెంకటేశ్వరనగర్, శ్రీనివాసనగర్‌లలో యూపీహెచ్‌సీలు ఉన్నాయి. అయితే వీటిలో మున్నేరు వరద ప్రభావం ఎక్కువగా వెంకటేశ్వరనగర్, శ్రీనివాసనగర్ సెంటర్లపై ప్రభావం చూపింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉండడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమై ముందస్తుగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. వెంకటేశ్వరనగర్ యూపీహెచ్‌సీ పరిధిలో డీపీఆర్‌ఓ, జూబ్లీక్లబ్, మంచికంటినగర్‌లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఒక్కో క్యాంపులో మెడికల్ ఆఫీసర్, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, సూపర్‌వైజర్ ఉండి తమ విధులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో వ్యాధుల ప్రభావం లేకపోయినా వైరల్ ఫీవర్స్, జలుబు, దగ్గు, కాళ్ల పగుళ్ల తదితర సమస్యలతో వస్తున్నారు. వైద్య శిబిరాల్లో పారాసిటమాల్, యాంటిబయాటిక్స్, జలుబు, దగ్గు, వాంతులు, డయోరియా వంటి సమస్యలకు మందులు, ఓఆర్‌ఎస్ ద్రావణాలు అందుబాటులో ఉంచారు. కాగా, సమస్య తీవ్రతను బట్టి మరిన్ని మందులు అందుబాటులో ఉంచుతామని మెడికల్ ఆఫీసర్లు చెబుతున్నారు. ఇక శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సీ పరిధిలో రాజేందర్ నగర్, మోతినగర్, పెద్దమ్మగుడి, ప్రకాశ్‌నగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో వ్యాధుల వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేబడుతున్నట్లు వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు.

వీధులన్నీ మురుగుమయం..

- నిలిచిన వ్యర్థాలతో కంపుకొడుతున్న బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్ ప్రాంతాలు


వ్యర్థాలు పడేస్తున్న స్థానికులు

ఖమ్మంరాపర్తినగర్: గత నాలుగు రోజుల క్రితం వరద ముంపునకు గురైన బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, మామిళ్లగూడెంలోని వెంకటేశ్వరకాలనీ తదితర ప్రాంతాల్లో చెత్త, మురుగు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. చెత్తను ఇప్పటికే తొలగించాల్సి ఉండగా.. అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతీ వీధిలో కనీసం మూడేసి ట్రాక్టర్లు చొప్పున ఏర్పాటు చేస్తే తప్ప బాగుపడదని, ముక్కు మూసుకుని నడవాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఈ దుర్గంధంతో లేనిపోని వ్యాధులు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. కాగా, అంతేకాక తాగునీటి సౌకర్యం లేకపోవడంతో స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యాన ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించడం, మున్సిపాలిటీ ఆధ్వర్యాన ఇప్పటికే ప్రత్యేక మోటార్లు ఏర్పాటు చేసి రోడ్లను శుభ్రం చేసే విధానానికి చర్యలు తీసుకుంది.

భరించలేకపోతున్నాం..



ముంచిన వరదతో అసలే ఇబ్బందుల్లో ఉంటే ఉదయం నుంచి కంపు వాసనతో సతమతమవుతున్నాం. ఇకనైనా రోడ్లను మున్సిపాలిటీ వారు త్వరగా శుభ్రం చేయాలి. చెత్తను కూడా వెంటనే తొలగించాలి లేకపోతే వ్యాధులబారిన పడే అవకాశం ఉంది. ఇకనైనా అధికారులు వీలైనంత త్వరగా చర్యలు చేపట్టాలి.

– నరసింహారావు, వెంకటేశ్వరనగర్

రాత్రికి రాత్రే ఆగమాగం..


తడిసిన సామగ్రిని తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

- ప్రకృతి ప్రకోపానికి దానవాయిగూడెం, రామన్నపేట ప్రాంతాలు విలవిల
- దెబ్బతిన్న ఇళ్లు, కొట్టుకుపోయిన సామగ్రి
- కట్టుబట్టలే మిగిలిన వైనం
- వరద ప్రభావిత బాధితుల పేర్లను నమోదు చేస్తున్న ఉద్యోగులు


రామన్నపేటలో వరద బాధితుల పేర్లను నమోదు చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంఅర్బన్: రాత్రి రాత్రే తమ జీవితాలను విచ్ఛిన్నం చేసేలా మున్నేరు వరద తమ కొంపలను ముంచిందని, ఎంతో ఆశతో తెచ్చుకున్న ఇంటి సామగ్రి అంతా గంగపాలు చేసిందని, చివరకు కట్టుబట్టలే మిగిల్చిందని నగరంలోని దానవాయిగూడెం, రామన్నపేటలోని మున్నేరు వరద ముంపు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద తాకిడి తగ్గిన తర్వాత ఇంట్లోకి వెళ్లి చూసిన బాధితులు రోదిస్తున్న తీరు చూపర్లు సైతం కంట నీరు తెప్పిస్తుంది. తడిసిన సామగ్రి, బట్టలు, తిండి గింజలు, టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, కుక్కర్లు, ఇలా నిలువెల్లా నష్టం చేకూర్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లోనే పైసా పైసా కూడబెట్టుకొని గూడు ఏర్పాటు చేసుకుని జీవన సాగిస్తున్న పేద, మధ్య తరగతి వారిని వరద నిండాముంచిందని, పాలకులు ముందస్తు చర్యలు తీసుకుంటే ఇంతటి నష్టం చూడాల్సి వచ్చేది కాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది అద్దెకు ఉండేవారు సైతం వరద బారిన పడి ఇదేం బాధ అంటూ బోరున విలపిస్తున్నారు. విద్యార్థుల పుస్తకాలు, సర్టిఫికెట్లు, నగదు, బంగారు ఆభరణాలు, బియ్యం ఇలా అన్ని తడిసి ఒండ్రుమట్టితో కప్పి ఉన్నాయని వాపోతున్నారు. రెండు కాలనీల్లో సుమారు 600 నుంచి 700 ఇళ్లు ముంపునకు గురికాగా.. నష్టం జరిగిన ఇళ్ల వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పేర్లు నమోదు చేసుకుంటున్నారు. ఓ వైపు ఆస్తులు నష్టం.. మరో వైపు అంటు వ్యాధుల బారిన పడతామని కాలనీవాసులు భయపడుతున్నారు.

దాచిన పింఛన్ గంగపాలు..



నా నెలవారి పింఛన్‌ను ఎటువంటి అవసరాలకు వాడకుండా జాగ్రత్తగా పెట్టెలో దాచిపెట్టా. వరద వచ్చి నా పింఛన్ జాడ లేకుండా చేసింది. ఇల్లు గుల్లతో పాటు వంట సామగ్రి సైతం దెబ్బతింది. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు. దాచిన రూ.10 వేలు పోయాయి.

– చాగంటి భారతమ్మ, దానవాయిగూడెం

సర్టిఫికెట్లన్నీ పోయాయి..



నేను డిగ్రీ వరకు చదువుకున్న సర్టిఫికెట్లు అన్ని ఇంట్లో కవరులో దాచి ఉంచా. ఊహించని విధంగా వరద వచ్చి ఇంట్లోని సామగ్రితో పాటు సర్టిఫికెట్లు కూడా కొట్టుకుపోయాయి. ఇప్పుడు ఏం చేయాలో తెలియడం లేదు. ప్రభుత్వమే సర్టిఫికెట్లు అందించి ఆదుకోవాలి.

– బానాల బ్రహ్మం, దానవాయిగూడెం

వరద కష్టాలు..


పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం రూరల్ జలగంనగర్‌లో వరద తగ్గిపోవడంతో పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు చేరిన బాధితులు తమ ఇళ్లను శుభ్రం చేసుకుంటూ.. బురదతో నిండిన వస్తువులను కడుగుకుంటూ కనిపించారు. కొందరు తమ సర్టిఫికెట్లను, ముఖ్యమైన కాగితాలను, ఆధార్, పాన్ కార్డులను ఆరబెట్టుకుంటున్నారు. దీంతో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆధ్వర్యాన వివిధ శాఖల అధికారులు ఫైరింజన్లతో రోడ్లు, డ్రెయినేజీలను శుభ్రం చేశారు. నగరపాలక సిబ్బంది శానిటేషన్ పనులు చేపట్టారు.

మమ్మల్ని ఆదుకోండి...

ఖమ్మంరూరల్: మున్నేరు వరద ముంపులో సర్వం కోల్పోయామని పెద్దతండాలోని మేఫీ మానసిక వికలాంగుల కేంద్రంలోని నిర్వాహకురాలు పద్మ, వికలాంగులు కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ సేవలు అందిస్తున్నామని, వరదతో మొత్తం తడిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దాతలు ఎవరైనా తమకు ఆర్థిక సాయం అందించాలని దీనంగా వేడుకుంటున్నారు.


దీనంగా వేడుకుంటున్న నిర్వాహకురాలు

ఎంసీహెచ్‌కు నీటి కష్టాలు...


కార్పొరేషన్ ట్యాంక్ ద్వారా నీరు నింపుతున్న దృశ్యం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)కు నీటి కష్టాలు వచ్చాయి. మిషన్ భగీరథ ద్వారా సరఫరా కావాల్సిన నీరు మున్నేరు వరదలతో నిలిచిపోయింది. ఫలితంగా ఎంసీహెచ్‌కు నీటి కొరత ఏర్పడగా.. ఆర్‌ఎంఓ డాక్టర్ రాంబాబు కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు పది ట్యాంకర్ల ద్వారా నిత్యం 50వేల లీటర్ల నీరు పంపించి ఎంసీహెచ్‌లోని ట్యాంక్‌లో నింపుతుండడంతో సమస్య పరిష్కారమైంది. మరోపక్క జనరల్ ఆస్పత్రికి మాత్రం నీటి సరఫరాలో ఆటంకం ఏర్పడలేదు.

పేదల కష్టార్జితం డంపింగ్‌యార్డు పాలు

ఖమ్మంఅర్బన్: ఇన్నాళ్లు ఉపయోగించుకున్న గృహోపకరణాలు ఇప్పుడు పనికి రాకుండా పోయాయి. మున్నేర వరద ఉధృతితో దానవాయిగూడెం, రామన్నపేట తదితర కాలనీల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. వరద తగ్గాక చూస్తే ఫ్రిజ్‌లు, టీవీలు, మంచాలు.. ఇలా చాలా సామగ్రి పనిచేసే పరిస్థితి కానరావడం లేదు. దీంతో చేసేదేం లేక బాధితులు కాలనీలకు వస్తున్న చెత్త ట్రాక్టర్లలో వేస్తుండడం కనిపించింది.


పరుపులు, ఇతర సామగ్రిని ట్రాక్టర్‌లో వేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరిస్తాం..

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగుల సమస్యలు వినడానికి, పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు, తెలంగాణ జేఏసీ స్టీరింగ్ కమిటీ మెంబర్ దేవరకొండ సైదులు, తదితరులు 39 డిమాండ్లను డిప్యూటీ సీఎం ముందుంచారు. దీంతో సమస్యలు పరిష్కరిస్తామని భట్టి హామీ ఇచ్చారు.

సీపీఆర్ చేసిన ఆర్ఎస్ఐ

ఖమ్మంఅర్బన్: నగరంలోని ధంసలాపురం కాలనీకి చెందిన చర్చి పాస్టర్ సల్మాన్‌రాజు గుండెపోటుకు గురై అల్లాడుతుండగా అక్కడే విధుల్లో ఉన్న ఆర్ఎస్ఐ రమేష్ వెంటనే స్పందించి సీపీఆర్ చేశాడు. ఆతర్వాత అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం అతడిని హైదరాబాద్‌కు తరలించగా ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

ఉచిత వైద్య శిబిరం

ఖమ్మంక్రైం: నగరంలోని స్తంభాద్రి ఆస్పత్రిలో విశ్రాంత పోలీస్ అధికారులు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన విశ్రాంత పోలీస్ అధికారులకు హృద్రోగ సంబంధిత ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మేదరమెట్ల అనిల్‌కుమార్, గట్టినేని సురేష్, గుమ్మడి రాఘవేంద్ర, కృష్ణసుమంత్, పేర్ల శ్రీహర్ష విశ్రాంత పోలీస్ ఉద్యోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, విశ్రాంత పోలీస్ అధికారి రాములు నాయక్, రిటైర్డ్ పోలీస్ అధికారులు జనార్దన్, ప్రతాప్‌రెడ్డి, నర్సయ్యలతో పాటు రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ పాల్గొన్నారు.

వరదపై అప్రమత్తం చేస్తాం

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరద ఉధృతిపై ఎప్పటికప్పుడు కార్పొరేటర్లను అప్రమత్తం చేస్తామని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. బుధవారం కేఎంసీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం 12.50 అడుగులకు వరద ఉందని, 16 అడుగులకు చేరిన వెంటనే కార్పొరేటర్లకు సమాచారం అందిస్తామన్నారు.

పంట నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన


తిరుమలాయపాలెం: బంధంపల్లిలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం/కూసుమంచి: వరదలతో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించే కార్యక్రమాలను మండలాల్లో వ్యవసాయాధికారులు బుధవారం నుంచి ప్రారంభించారు. ఈక్రమంలో నేలకొండపల్లి మండలంలో వ్యవసాయాధికారి డి.అరుణకుమారి ఆధ్వర్యాన పరిశీలించగా, తిరుమలాయపాలెం మండలంలో వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి ఆధ్వర్యాన, కూసుమంచి మండలంలో ఏఓ వాణి ఆధ్వర్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దెబ్బతిన్న పంటలపై ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా చేయనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయ్యాక నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ విస్తీర్ణాధికారులు శిరీష, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.50 వేలు అందించాలి..

నేలకొండపల్లి: వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.50వేలు పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలో దెబ్బతిన్న పంటలను బుధవారం రైతు సంఘం బృందం పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘం నాయకులు మాదినేని రమేష్, గుడవర్తి నాగేశ్వరరావు, బండి రమేష్, బుగ్గవీటి సరళ, మండల అధ్యక్షుడు ఇంటూరి ఆశోక్, కార్యదర్శి రచ్చా నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ


చెక్కు అందిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంరూరల్: ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి బుధవారం లబ్ధిదారులకు అందించారు. ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించిన 88 మందికి రూ.23లక్షల చెక్కులను అందించారు. రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో పాటు తుశ్లూరు బ్రహ్మయ్య, కొప్పుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండలంలోని కరుణగిరి, రాజీవ్‌గృహకల్ప ప్రాంతాల్లో వరద బాధితులకు ఎంపీ అన్నదానం చేశారు.

జూబ్లీక్లబ్ సందర్శన..

ఖమ్మం స్పోర్ట్స్/ఖమ్మంవన్‌టౌన్: కురుస్తున్న వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న నగరంలోని జూబ్లీక్లబ్‌ను బుధవారం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా క్లబ్‌లోని ఉడెన్ బ్యాడ్మింటన్ కోర్టు పూర్తిగా దెబ్బతిందని పేర్కొంటూ క్లబ్ సభ్యులు ఎంపీకి వినతిపత్రం అందజేయగా.. అన్ని విధాల సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట క్లబ్ సభ్యులు పోట్ల శ్రీకాంత్, నాగరాజ దేవర, తదితరులు ఉన్నారు.

సహాయక చర్యలు చేపట్టాలి

తిరుమలాయపాలెం: వరదలతో నష్టపోయిన బాధితలకుతక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. బుధవారం తిరుమలాయపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాను బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న మండల కేంద్రాల్లో, 10వ తారీఖున జిల్లా కేంద్రంలో ప్రదర్శనలు, ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ తో పాటు కోలా లక్ష్మీనారాయణ, శీలం సుదర్శన్, ఐ.వెంకన్న, గొర్రెపాటి రమేష్, నాయకులు ఉమాశంకర్, వీరస్వామి, మస్తాన్ పాల్గొన్నారు.

పోషక మాసోత్సవం

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలాయపాలెం ఐసీడీఓ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ కె.పార్వతి పోషక లోపాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు బి.కోటేశ్వరీ, జానకి, ఉమా, శారద, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా 'మిత్ర'

ఖమ్మంగాంధీచౌక్: మున్నేరు వరద బాధితులకు ఆపన్నహస్తం అందించేందుకు తమ సంస్థ ద్వారా రూ.10లక్షల విలువైన నిత్యావసరాలు అందించనున్నామని, భద్రాచలం వరద బాధితులకు రూ.11 లక్షలు విరాళం అందించి ప్రస్తుతం నిత్యావసరాలను అందిస్తుందని మిత్ర ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు చారుగుండ్ల రవికుమార్, పాలవరపు శ్రీనివాస్, చెరుకూరి యుగంధర్, మహంకాళి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇంటిబాట

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంనగర్‌లో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో వరదలతో బురదమయం కాగా పాఠశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఉన్నతాధికారుల సూచనలతో వారి ఇళ్లకు పంపించారు. కాగా, వరదల్లో 45 క్వింటాళ్ల బియ్యంతో పాటు మొత్తం రూ.1.30లక్షల విలువ గల సామగ్రి తడిచిపోయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బియ్యం వితరణ

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంకు చెందిన ధరావత్ వెంకట్రామ్ ఇటీవల మృతి చెందగా బుధవారం కేఎల్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఒక క్వింటా బియ్యం వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో తేజావత్ రామోజీ, బానోత్ కృష్ణ, కిరణ్‌కుమార్, బానోత్ కీమా, భూక్యా రాంబాబు, చంద్రకాని లింగారావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత విద్యార్థికి 'ఎస్‌బీఐటీ' ఆపన్నహస్తం

ఖమ్మం సహకారనగర్: ఇటీవల నాయకన్‌గూడెం దగ్గర ప్రవాహంలో చిక్కుకొని తల్లిదండ్రులను కోల్పోయిన తమ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి షేక్ షరీఫ్‌కు అన్ని విధాలా అండగా ఉంటామని ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. షరీఫ్ తన విద్యను అర్థాంతరంగా ఆపకుండా నేషనల్ ఇన్సూరెన్స్ వారి సహకారంతో రూ.2లక్షలు ఆర్థిక సాయం అందనుందని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జె.రవీంద్రబాబు, ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురి దాతృత్వం..


ఖమ్మంమామిళ్లగూడెం: దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నేత తాండ్ర వినోద్‌రావు


ఖమ్మంఅర్బన్ దానవాయిగూడెంలో ఆహార ప్యాకెట్లను అందిస్తున్న విద్యుత్‌శాఖ ఉద్యోగులు


బొక్కలగడ్డలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యకర్తలు

- **ఖమ్మంఅర్బన్:** పట్టణంలోని సారధినగర్ కాలనీలో సుమారు 400 మంది వరద బాధితులకు శ్రీ సాయి కంటి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ అమరనాథ్ ఆధ్వర్యంలో పులిహోర పాకెట్లు, బ్రెడ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. అలాగే నగరంలోని 4వ డివిజన్ మంచికంటినగర్, ఖానాపూర్ హవేలీ ప్రాంతాల్లో పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యాన దుస్తులు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. అలాగే క్రెడాయ్ ఖమ్మం ప్రెసిడెంట్ బండి జయకిషోర్ ఆధ్వర్యాన అన్నదానం చేశారు. అంతేకాక నగరంలోని ధంసలాపురం కాలనీలో కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు దుస్తులు పంపిణీ చేశారు. అలాగే ధంసలాపురం కొత్తకాలనీలో శ్రేయాస్ ఇంపాక్ట్ ఫౌండేషన్ ద్వారా అన్నదానం చేశారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యాన రామన్నపేట, దానవాయిగూడెం ప్రాంతవాసులకు భోజన ప్యాకెట్లు అందించారు.
- **ఖమ్మంమయూరిసెంటర్:** నగరంలోని బొక్కలగడ్డలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యకర్తలు 40 మంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు.
- **ఖమ్మం సహకారనగర్:** నగరంలోని ధంసలాపురంలో ప్రైవేట్ టీచర్లు అన్నదానం నిర్వహించగా... ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పునరావాస కేంద్రంలో ఉంటున్న వారికి ఉపాధ్యాయ దంపతులు బానోత్ గోపి, కస్తూరిబాయిలు దుస్తులు పంపిణీ చేశారు. ధంసలాపురం ప్రాంత స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న రవిబాబు బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను అందించారు.
- **ఖమ్మంవ్యవసాయం:** నగరంలోని దానవాయిగూడెం, రామన్నపేట కాలనీల్లో 700 కుటుంబాలకు విద్యుత్ శాఖ ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలాగే జూబ్లీ క్లబ్ పునరావాస కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) దుప్పట్లు, టవల్స్‌ను పంపిణీ చేసింది. అంతేకాక ధంసలాపురం, కొత్త కాలనీల్లో మూవీ ప్రమోషన్స్ ఏజెన్సీ శ్రేయాస్ మీడియా సంస్థ అన్నదానం చేసింది.
- **ఖమ్మం మామిళ్లగూడెం:** వరద బాధిత జర్నలిస్టుల కుటుంబాలకు ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యాన నిత్యావసర వస్తువులు అందించారు. అలాగే దనావాయగూడెం, రామన్నపేట తదితర ప్రాంతాల్లో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యాన దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. అంతేకాక బీజేపీ నేత తాండ్ర వినోద్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో కలిసి దుప్పట్లు, భోజనాలు అందించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యాన మంచికంటి నగర్‌లో భోజనాలు అందజేశారు.
- **ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలం కస్నా తండాలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావు ఆధ్వర్యాన మున్నేరు వరద బాధితులకు 250 దుప్పట్లను పంపిణీ చేశారు.
- **ఖమ్మంగాంధీచౌక్:** ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ ఉద్యోగులు వివిధ రూపాల్లో అందించిన విరాళాలతో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి ఆధ్వర్యాన నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేశారు.
- **రఘునాథపాలెం:** రఘునాథపాలెం మండలం మంచుకొండ క్రీస్తు కృప ప్రార్థన మందిరం సహకారంతో అమ్మ ఫౌండేషన్ ద్వారా కరుణగిరి రాజీవ్ స్వగృహ, మున్నేరు ప్రాంతం వరద బాధితులకు గురువారం సుమారు 200 మందికి దుప్పట్లు, చీరలు, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు.
- **నేలకొండపల్లి:** మండలంలోని సుర్దేపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో 250 కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సూచనలు మేరకు బీఆర్ఎస్ నాయకులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.